## పుస్తక పరిచయం

గిరిధర్ వాణి తమ ఆశ్రితులకు, జీవి యొక్క నిజ సౌందర్యము గురించి తెలియచేసి ఆస్వాదింపచేసారు. 27-09-09 నుంచీ 29-09-09 దాకా విజయదశమి ఉత్సవాల సందర్భాల సందర్భంగా తెలియచేసిన విశేషాల సారాంశమే ఈ పుస్తకము.

**-గిరిధర్‌వాణి ఆనందనందనం.**

# సర్వ పరిపూర్ణత్వం

**- నిజ సౌందర్యం**

జీవి కలిగి వుండాల్సిన నిజ ఆయుధం (స్వధర్మము) గురించి నిజ ఆభరణం (సహజత్వము) గురించి గిరిధర్ వాణి పలు సందర్భాలలో చర్చించింది. ఇప్పుడు జీవి యొక్క నిజ సౌందర్యం గురించి వివరిస్తోంది. జీవి యొక్క నిజ సౌందర్యం "సర్వ పరిపూర్ణత్వము"

గమ్యాన్ని చేరడానికి జీవి ఆధారపడిన మార్గము, ఆధారపడ్డ జీవి రెండూ ఫలించి; జీవి మార్గానికీ గమ్యానికీ తనకి తనూ అతీతమై ఫలించటాన్ని సర్వ పరిపూర్ణము అంటాము. సర్వ పరిపూర్ణత్వము గురించి ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ విధంగా చెప్పవచ్చు. ఫలించిన జీవి గమ్యందాకా చేరాక తిరిగి ఫలించాలి సర్వాతీతము కావాలి ఇదే సర్వపరిపూర్ణత.

సర్వ పరిపూర్ణతను పూర్తి పూర్తిగా అర్థం చేసుకోవాలంటే జీవి నాలుగు అంశాలను అవగాహన చేసుకోవాలి. ఆ నాలుగు అంశాలు వరుసగా

1. జీవి ఫలించాలి
2. జీవి ఎంచుకున్న మార్గము ఫలించాలి.
3. గమ్యానికి చేరుకున్న జీవి తిరిగి ఫలించాలి.
4. సర్వవిధాల ఫలించిన జీవి సర్వానికీ అతీతం అవ్వాలి. ఏ స్థితిలోనైనా వ్యవస్థితం కాగల్గాలి.

ఈ నాలుగు అంశాలను విడివిడిగా చర్చించుకుంటూ అర్థం చేసుకుంటూ సర్వ పరిపూర్ణతను సంతరించుకునే దిశగా సాగుదాం. గుడ్డ పీలికలు అయినా ధరించగల్గే స్తోమత లేని మనకు జరీ శాలువా కప్పుతున్న మన యజమానికి ముందుగా అనంత కోటి నమస్కారాలు కృతజ్ఞతలు చెల్లించుకుందాం! అనగా గుడ్డపీలికలు లాంటి చిన్న చిన్న స్థితులనీ వాటి గతులనీ కూడా అర్థం చేసుకుని

నిలుపుకోలేనీ మనకు జరీ శాలువా లాంటి సర్వపరిపూర్ణత్వం అనే స్థితిని దాని గతినీ అర్థం చేయిస్తున్న యజమానికి జైజైలు చెప్పుకుందాం! మన సమస్తానికీ భగవంతుడి యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పుదాం!

## 1. జీవి ఫలించాలి

జీవి ఫలించడానికి అంటే విజయం పొందడానికి కావల్సిన అర్హతలు :

జీవి తన సంశయాలకి, సందేహాలకి, లాభ నష్టాలకి అతీతంగా భగవంతుడిని నమ్మాలి. భగవంతుడి గురించి తన గురించి ఎన్నో ప్రశ్నలు సంశయాలు జీవికి వుండవచ్చు గాక కానీ జీవికి మాత్రం ఎప్పుడూ తనను నడిపించే శక్తి ఒకటి తనపై వుందని గుర్తుండాలి. తన సందేహాలు నివృత్తి కాబడుతున్నాయా లేదా అన్న దానితో సంబంధం లేకుండా భగవంతుడిని నమ్మాలి. తనకు కలుగుతున్న లాభం, నష్టం రెండింటికి సంబంధం లేకుండా భగవంతుడిని నమ్మాలి. ఇచ్చి పుచ్చుకోవడాలతో సంబంధం లేకుండా భగవంతుడిని నమ్మాలి. అప్పుడే జీవిలో లావాదేవీలు ఆగిపోయి జీవి నిర్వ్యాపారుడిగా మారిపోతుంది.

పై విధంగా కాకుండా జీవి సందేహాలను సంశయాలను తీర్చుకుంటూ పోతే జీవిత కాలమంతా ఆ పనితోనే సరిపోతుంది. జీవికి సంశయం వస్తుంది సమాధానం దొరికాక పోతుంది మళ్ళీ మరో సంశయం వస్తుంది కొంత కాలానికి నివృత్తి కాబడుతుంది సరికదా పై పెచ్చు వచ్చిన సమాధానాల వల్ల జీవి అహంకారిగా కూడా మారవచ్చు. ఇలా జీవి సందేహాలు తీరతాయి. కానీ జీవికి పరిణితి రాదు. దొరికిన సమాధానాన్ని ఆనందించి అన్వయించుకునే లోపే ఇంకో సందేహం మొలకెత్తుతుంది. ఇలా జీవిలో సంశయాలు సందేహాల రాక పోకలు నిరంతరం జరుగుతూనే వుంటాయి. అలాగే నష్టాలకీ భగవంతుడికీ లింకు పెడితే భగవంతుడిపై నమ్మకం నిలువదు. లాభాలకి భగవంతుడికి లింకు పెడితే భగవంతుడంటే అవసరాలు తీర్చే యంత్రంగా జీవి అలవాటు పడుతుంది. భగవంతుడితో పని చేయించుకోవటమే జీవి ఉద్దేశము లక్ష్యము అయిపోతుంది. ఇలా జీవిలో నిరంతరము రాక పోకలు లావాదేవీల హడావుడి నెలకొని వుంటుంది.



అందుకే సంశయాలకి, సందేహాలకి, లాభానికి నష్టానికి ముడి పెట్టకుండా జీవి భగవంతుడిని నమ్మగల్గాలి అంటే ఏ Confirmation లేకుండా భగవంతుడిని తన పై అధికారిగా జీవి నమ్మగల్గాలి. అలాంటి  నమ్మకం ఏర్పడిన జీవిలో ఎన్ని సందేహాలు సంశయాలు కోరికలు లాంటివి వున్నా అవి మొలకెత్తవు. అంటే నమ్మకము అనే మహా వృక్షపు నీడలో ఈ సంశయాలు, సందేహాలు అనే కలుపు మొక్కలు బీజాలలానే వుంటాయి కానీ మొలకెత్తవు.

మరి సందేహాలు సంశయాలు తీర్చబడవా? అంటే సమయానుకూలంగా ఒక్కో విషయం అర్థమవుతూ ఉంటుంది. జీవి పురోగభివృద్ధి చెందుతూ వుంటే వచ్చే పరిణితిలో ఒక్కో ప్రశ్న విప్పబడుతుంది సునాయాసంగా. అలా కాకుండా ప్రశ్నలు విప్పుతూ వుంటే పరిణితి సునాయాసంగా వస్తుందనటానికి గ్యారెంటీ లేదు. ఎందుకంటే విత్తనాన్ని మొలకెత్త నిస్తే ఎన్ని కొమ్మలు విరిచినా కొత్త కొమ్మలు వచ్చి దట్టమైన అడవి పెరుగుతుంది. అదే విత్తనాలను (సంశయాలు, సందేహాలు, కోరికలు) మొలకెత్తనివ్వకపోతే సునాయాసంగా ముందుకు పోవచ్చు సమయాను కూలంగా విత్తనాలు ఏరివేయబడతాయి లేదా మాడిపోతాయి.

తొలిదశలోనే స్వస్వరూపం అనే దాని మీద జీవికి సందేహం వచ్చింది అనుకుందాం దానికి సమాధానం దొరికినా జీవికి పరిణితి లేకపోవడంతో ఆ సమాధానం నుంచీ మరో సందేహం వస్తుంది దాని సమాధానం నుంచీ మరో సందేహం ఇలా Chain reaction  జరిగి జీవికి ఆ సంశయ సమాధానాలనే గొలుసులే సంకెళ్ళుగా మారుతాయి. అందుకనే తీర్చుకోవడానికి త్వరపడక నిశ్చింతగా వుండగల్గాలి. అలా ఎలా వుండగల్గడం? అంటే వచ్చిన సందేహం మీద కాక వున్న భగవంతుడి మీద మన attention  (శ్రద్ధ) వుంటే ఆ సందేహం మనలని సతాయించదు. ఆ సమాధానాన్ని సరిగ్గా అర్థం చేసుకొనే పరిణితి జీవికి వచ్చినప్పుడు ఆ సమాధానమే వచ్చి జీవికి దాసోహం అంటుంది.

ఇలాగే కోరికల విషయంలో కూడా జీవి ప్రవర్తించ గల్గాలి. కోరికలు రాకుండా వుండాలని ప్రయత్నిస్తూ జీవి తన Package ని కట్టడి చేసినా అవి తీర్చుకోవటానికి

ప్రయత్నం చేసినా సమయం వృధా అవ్వటమే కాక జీవికి పరిణితి రాదు. అదే వచ్చిన కోరిక మీద కాక భగవంతుడి మీద attention (శ్రద్ధని) వుంటే జీవికి మేలు కలిగే విధంగా ఆ కోరిక తీర్చబడుతుంది. బాబానే కోరిక తీరుస్తారని అదే పనిగా ప్రార్థించటం లాంటివి అలవాటు చేసుకోకూడదు. అందుకే లాభానికి బాబాకీ ముడిపెట్టవద్దు అన్నది. లాభం ఇచ్చేది బాబానే అయినా బాబా శుభ లాభాలను ఇస్తారన్న విషయం కన్నా బాబానే జీవికి సదా గుర్తుండాలి. లేదంటే జీవి యజమానిని వారి దర్జాలో నిలుపదు వారి (మానాన్ని) గౌరవాన్ని నిలుపక ఎంత సేపు ఒక యంత్రంగా వారిని వాడుకోవాలని చూస్తుంది. బాబాని యజమాని హోదాలో నిలిపినప్పుడే కదా, వారి గౌరవంకి తగ్గట్లు వారిని వుంచినప్పుడే కదా జీవికి పరిణితి వచ్చేది.

ఇలా సంశయ సందేహాలకి లాభ నష్టాలకి కోరికలకి ముడి పెట్టకుండా జీవి భగవంతుడిని నమ్మగల్గితే జీవికి పరిణితి తప్పక వస్తుంది. ఇందాకటి నుంచీ పరిణితి వస్తుంది అంటున్నాం కదా అది ఎలాంటిదో చూద్దాం. పరిణితి అంటే జీవిని ఊర్ధ్వ దశలోకి తీసుకువెళ్ళే మార్పు. పైన పేర్కొన్న విధంగా జీవి వుండటం వల్ల జీవి సమయం వృథా కాక జీవిలో రాకపోకలు లాంటి అలజడి తగ్గుతుంది. జీవి నిర్వ్యాపారుడిగా ఎదుగుతాడు. ఒక సాధారణ జీవి నిర్వ్యాపారుడిగా ఎదగగల్గితే ఆ జీవి ఫలించినట్లే. కేవలం నిర్వ్యా పారుడిగా జీవి వుండ గల్గితే చాలు అతనికి తప్పక విజయం లభిస్తుంది. తన యొక్క నిజ శక్తి - యుక్తులను అతను అనుభవించగల్గుతాడు ఇంత కన్నా గొప్ప విజయం వుంటుందా? అందుకే జీవి ఫలించినట్లే! జన్మకి వచ్చిన జీవి తన నిజ శక్తి యుక్తులను అనుభవించ గల్గితే ఆ జీవి ఫలించినట్లే కదా!

జీవి ఫలించటానికి దోహద పడ్డ విషయాన్ని మరోసారి గుర్తు చేసుకుందాం! జీవి తనకు వచ్చిన సంశయాలు సందేహాలు కోరికలపై ధ్యాస పెట్టకుండా, వాటిని తీర్చేవాడూ భగవంతుడే అన్న విషయం పై ధ్యాస పెట్టకుండా, కేవలం భగవంతుడిపైన మాత్రమే ధ్యాస పెట్టగల్గితే జీవి నిర్వ్యాపారుడై ఫలించ గల్గుతారు.



వచ్చిన విషయాలపై ధ్యాస పెడితే వారు ప్రయత్నశీలురు, వచ్చిన విషయాలను సంభాళించేది భగవంతుడే అన్న విషయంపై ధ్యాస పెడితే వారు అవకాశ వాదులు దోపిడీ దొంగలు, కేవలం భగవంతుడి మీదే ధ్యాస పెడితే వారు అనన్య భక్తి పరాయణులు. వారి ధ్యాస విషయం మీద కానీ, అది సంభాళించ బడుతుంది అన్న విశ్వాసంపై కానీ కాక యజమాని పై మాత్రమే వుంటుంది. వారి ధ్యాస దేని మీద విభజించపడలేదు కేవలం భగవంతుడి మీదే వుంది.

అప్పటికి భగవంతుడిని ఆ జీవి పూర్తిగా తెలుసుకుని కూడా వుండి వుండదు కాబట్టి భగవంతుడు వున్నాడు అన్న నమ్మకం మీదే చూడని భగవంతుడిపై ధ్యాగు గల్గి వుంటుంది. గుడ్డి నమ్మకాన్ని కలిగి వుంటుంది. గుడ్డి నమ్మకం అని ఎందుకు అంటున్నామంటే ఈ దశలో జీవికి భగవంతుడి గురించి పూర్తి విషయం తెలీదు కేవలం వున్నాడు అన్న నమ్మకంతోనే నిలిచి వుంటుంది. కాబట్టి ఏ Confirmation లేని ఆ నమ్మకాన్ని గుడ్డి నమ్మకం అన్నాము.

ఇలా జీవి తన ధ్యాసను కేవలం భగవంతుడిపైన నిలపడం వల్ల (Undivided attention ) రాక పోకలు లేని భగవంతుడిలాగా నిర్వ్యా పారునిగా మారిపోతుంది. దాంతో జీవి యొక్క శక్తి యుక్తులు వ్యాపారాన్ని నడిపే బాధ్యత నుండీ విడుదల కాబడతాయి. ఆ శక్తి యుక్తులు పూర్తిగా జీవి నిజాన్ని అనుభవించటానికి వాడబడతాయి అంటే జీవి తన నిజ సామర్థ్యాన్ని అనుభవిస్తుంది. కాబట్టి జీవి ఫలించినట్లే కదా! జీవిలో వ్యాపారం ఆగనంత కాలం కలుపు మొక్కలే ఏపుగా పెరుగుతాయి శక్తి - యుక్తులన్నీ ఆ కలుపు మొక్కలకే ఎరువులుగా ఉపయోగ పడతాయి. అదే జీవిలో undivided attention వల్ల అనగా ఫలించిన ధ్యాస వల్ల వ్యాపారం ఆగిపోతే జీవిలో నిజం ఏపుగా పెరుగుతుంది శక్తి యుక్తులన్నీ ఆ నిజంలో నిలవడానికి ఉపయోగపడతాయి. జీవి ఫలిస్తుంది.

ఇలా జీవి తన సంశయాలు, తన సందేహాలు, తన కోరికలు, తన లాభాలు, తన నష్టాలు, తన అభిప్రాయాలు, తన భావాలు నుండీ విడుదల కాబడుతుంది. అంటే జీవి తన నుండీ తను విడుదల కాబడుతుంది. నిర్వ్యాపారిగా మారిన

జీవిలో ఖాళీ ఏర్పడుతుంది. జీవిలో పాతవన్నీ కొట్టుకుపోయి నిశ్చలత ఏర్పడి ఖాళీ ఏర్పడటం అన్నది ఎంత అవసరమో మనకు తెలిసిందే కదా!

## 2. జీవి ఎంచుకున్న మార్గము ఫలించాలి

భగవంతుడిని పొందాలి అనో, నిజాన్ని అనుభవించాలి అనో భగవంతుడు లేడు అనో ఏదో ఒక ఉద్దేశంతో జీవి అన్వేషణ సాగిస్తుంది. తన అన్వేషణను కొనసాగించడానికి మార్గాన్ని ఎంచుకుంటుంది. భగవంతుడు లేడు అనే వారి సంగతి పక్కన పెట్టి భగవంతుడు వున్నాడు అని నమ్మి ప్రయాణం సాగిస్తున్న మన గురించి మనం తెలుసుకుందాం.

భగవంతుడు వున్నాడు అన్న విషయాన్నే గుడ్డిగా నమ్మిన జీవి తనకు తెలియకుండా భగవంతుడి వైపు నడవడం Start చేస్తుంది. జీవి తనకు తెలియకుండానే భగవంతుడి పట్ల భక్తిని, ప్రేమని, గౌరవాన్ని, భయాన్ని, అనురాగాన్నీ కలిగి వుంటుంది. జీవి అకారణంగానే భగవంతుడిపై ప్రేమను, భక్తిని పరిశుద్ధంగా కలిగి వుంటుంది. జీవి తను కలిగి వున్న పరిశుద్ధమైన ప్రేమను, భక్తిని, ఆరాధనని ఆధారంగా చేసుకుని ఆ మార్గాలలో భగవంతుడి వైపుగా వెళ్తుంది. ఆ మార్గాలు జీవిని నిజస్థితికి తీసుకువెళ్ళి నిజాన్ని అనుభవింపచేసిన కీర్తిని ఆ మార్గాలు పొంది భగవంతుడిచే సత్కరింపబడి భగవంతుని చరణాలను అలంకరించి ఫలిస్తాయి. జీవిని గమ్యానికి చేర్చిన మార్గమూ ఇలా ఫలిస్తుంది. జీవి తన ధ్యాసను విభజించకుండా వుంటే (un divided attention వల్ల) ఈ పని అంతా దానంతట అది సహజంగా జరిగిపోతుంది. జీవి యొక్క ప్రమేయం కూడా లేకుండా జీవి ఏదో ఒక మార్గములో భగవంతుని పొంది తరిస్తుంది. తద్వారా మార్గమూ ఫలిస్తుంది. ఇదంతా ఇలా జరిగిపోతే సమస్యే లేదు అనందో బ్రహ్మ!

కానీ చిత్ర విచిత్రం ఏమిటంటే జీవి దగ్గర ఇలా జరగడం లేదు. జీవి తను పయనిస్తున్న మార్గం మీద కూడా తన ధ్యాసను నిలుపుతోంది అక్కడ వస్తోంది చిక్కంతా! జీవి తను పయనిస్తున్న మార్గము, దానిలోని వింతలూ విశేషాల మీద కూడా ధ్యాస నిలపడంతో వాటి ప్రభావం జీవిపై పడి జీవీ చెడిపోతుంది తద్వారా



మార్గమూ అవకీర్తి పాలయి ఫలించట్లేదు.

అంతే కదా! భక్తి మార్గాన్ని ఎంచుకున్న జీవి లక్ష్యాన్ని పొందకపోతే భక్తి మార్గాన్నీ ఎవరూ ఆశ్రయించరు కదా! అలాగే ప్రేమ మార్గము, తపస్సు, యోగము లేదా గురువుని ఆశ్రయించినప్పుడు వారు చూపిన గురు మార్గము ఏదైనా సరే జీవి తన ధ్యాసను మార్గం వైపు మరల్చే సరికి ఆ మార్గ ప్రభావమూ జీవిపై పడి జీవి వృద్ధిపొందక చెడిపోతుంది. తద్వారా ఆయా మార్గాలు, గురువులు భగవంతుడి దగ్గర అపకీర్తిపాలవుతాయి. కొంతకాలం ఆ మార్గము కీర్తించబడినా ఆ కీర్తి చిరకాలం నిలువదు.

కాబట్టి మార్గము వల్ల జీవి చెడగొట్ట పడకుండా వుండాలన్నా, జీవి-మార్గామూ రెండూ గమ్యాన్ని చేరాలన్నా జీవి గుర్తుంచుకోవాల్సిన విషయాలను గురించి సవివరంగా తెలుసుకుందాం. జీవి తను పయనిస్తున్న మార్గమును గమనించినట్లయితే ఆ మార్గములో జీవిలో కలిగే మార్పులకు జీవికి అహంకారం రావచ్చు. ఉదాహరణకు జీవి ప్రేమ మార్గంలో పయనిస్తోంది అనుకుందాం. ఆ జీవి తనలో భగవంతుడి పట్ల పుడుతున్న ప్రేమను గమనించినట్లయితే ఆ ప్రేమ జీవిని బలహీనపరుస్తుంది. ఆ ప్రేమను అర్హతగా చూపి భగవంతుడిని (demand) చేస్తుంది. ఆ ప్రేమను తనపై వేసుకుని ప్రేమలో కలిసి కరిగి ప్రేమగా మారిపోతుంది. అంటే గమ్యానికి వెళ్ళాల్సిన జీవి మార్గంగా మారితే చిత్ర విచిత్రమే కదా! ప్రేమను గమనిస్తే అది returns కోరుతుంది కదా! భగవంతుడు కాబట్టి ఆయనపై ప్రేమ కలుగుతుంది అది అతి సహజం. అదేమన్నా గొప్ప ఘన కార్యమా దానిని అర్హతగా చూపి Cash చేసుకోవడానికి.

అలాగే జ్ఞాన మార్గంలో వెళితే ఎన్నో విషయాలు తెలియబడతాయి ఆ మాత్రానికే వాటిని గమనించి నాకు అంతా బోధపడిపోతోందని పయనాన్ని ఆపేసి రోడ్డు మీదే గుడిసె వేసి దుకాణం పెట్టి జ్ఞానాన్ని చెపుతూ వుంటే చిత్రవిచిత్రం కదా! భగవంతుడు విశేషమైన వాడు కాబట్టి వారి మీద ధ్యాస పెట్టినప్పుడు ఎన్నో విశేషాలు తెలియబడతాయి. ఆ విశేష విషయాలలో పడి ప్రయాణాన్ని ఆపితే జీవీ

మార్గమూ రెండూ విఫలమైనట్లే కదా!

అలాగే భక్తి మార్గంలో పడి భక్తుడిగా భక్తాగ్రేశ్వరుడిగా మారటం నిజం కాదుగా! భక్తిని నిచ్చెనగా వేసుకుని నిజస్థితిని ఎక్కగల్గాలి. యోగాన్ని నేర్చుకుని నిజ శక్తి - యుక్తులను అధిష్టించాలి కానీ తెలియపడ్డ యోగ మెళకువులతోనే ప్రయాణాన్ని ఆపకూడదు. తపస్సు చేస్తూ ప్రాపంచిక అవధిని దాటగానే ఆపేస్తే తపోఫలం పొందినట్లా? ఇవన్నీ చేస్తున్న భక్తిని, యోగాన్ని, తపస్సును చూడటం వల్ల, చూసి సంతృప్తి పడటం వల్ల జరిగే అనర్థాలు.

అలాగే స్వధర్మం ఆచరిస్తూ గమనింపే పనిగా మారినా లాభం లేదు కదా! సందర్భం వచ్చినప్పుడు గమనింపుని ఉపసంహరించుకో లేకపోతే ఉనికిగా మారలేదు జీవి. Let it work జరుగుతున్నప్పుడు. "it" (దివ్యత్వానికి) కి మన భావాలతో margins వేస్తే (దిశానిర్దేశం చేస్తే) ఆ మార్గము విజయవంతం కాదు.

ఒప్పుదల మార్గములో నడిచే జీవి తన ఒప్పుదల పట్ల అహంకరిస్తే, తను ఒప్పుకున్న యజమానిని ఆయన శైలిలో పని చేసుకోనీయకపోతే "ఒప్పుదల" మార్గమూ విజయవంతం కాదు.

అలాగే గురువుని ఆశ్రయించినప్పుడు వారు సూచించిన మార్గములో పయనిస్తే ఆ మార్గము ఎలాంటిది అయినా జీవి చూపే నమ్మకం వల్ల విజయం సునాయాసంగా లభ్యమవుతుంది. కానీ జీవి కనుక గురువు విషయాల మీద అక్కడి వ్యవహారాల మీద ధ్యాస పెడితే మాత్రం ఆ ప్రభావం జీవిపై పడి ఏవేవో సందేహాలు తిరిగి పుట్టి నమ్మకం సడలి జీవి విజయాన్ని పొందలేదు తద్వారా మార్గమూ ఫలించలేదు.

ఇలా జీవి ఫలవంతమైన తర్వాత కూడా అంటే నిర్వ్యాపారునిగా మారి ఖాళీని ఏర్పర్చుకున్న తర్వాత కూడా తన ధ్యాసను మార్గము వైపుకు మళ్ళించడం వల్ల చెడగొట్టబడుతోంది. ధ్యాస మార్గము వైపుకి మరల్చడం వల్ల జీవి ప్రాధాన్యత అంటే జీవి యొక్క లక్ష్యం మారిపోతుంది. కేవలం నిజం తెలుసుకుని నిజస్థితిలో నిలిచి తన నిజ సామార్థ్యాన్ని అనుభవించడమే తన ప్రధాన లక్ష్యంగా వున్న జీవి మార్గాన్నీ



గమనించేటప్పటికీ తన ప్రేమను నిలుపు కోవడమో, ప్రేమించబడటమో, భగవంతుని వారి ఉద్దేశాన్ని ప్రచారం చెయ్యడమో, యోగాన్ని అధిరోహించడమో, వస్తున్న స్థితి గతులలో నిలువడమో, మహిమను పొందటమో తన లక్ష్యంగా మార్చేసుకుంటోంది. ఇలా మార్గమూ, జీవి రెండూ విఫలమవుతున్నాయి.

జీవి కనుక తన ధ్యాసను మరల్చకుండా వుంటే తన ధ్యాసను మార్గము వైపుకి మరల్చకుండా వుంటే మార్గము ఏదైనా సరే ఫలవంతమవుతుంది. ఒక వేళ జీవి నడుస్తున్న మార్గము పూర్తిస్థాయి ఫలితాన్ని ఇప్పించలేనిదైతే ఆ మార్గమే జీవి దారి నుంచీ తప్పుకుని జీవిని అత్యున్నత మార్గము వైపుకు మళ్ళిస్తుంది. ఇదంతా జీవి ప్రమేయం లేకుండా సహజంగా దానంతట అదే జరుగుతుంది. ఇలా దానంతట అది విజయం ప్రాప్తించబడటానికి సూత్రం మాత్రం విభజించబడని ధ్యాస (శ్రద్ధ) (Undivided attention) ఈ ధ్యాస జీవికి ఏర్పడటానికి ఉండాల్సిన ప్రాథమిక అంశం నమ్మకం, ఇంకా పూర్తిగా తెలియబడని భగవంతుని కూడా వున్నాడని గుడ్డిగా నమ్మగల్గటం (సబూరి). ఈ Qualities (లక్షణాల) వల్ల జీవి తన ప్రమేయం, ప్రయత్నంలో పని లేకుండా ఫలిస్తుంది. జీవికి ఏ మాయా అంటదు.

ధ్యాస మరల్చిన జీవి మార్గాన్ని సరిచేయటమో, మార్గానికి అనుకూలంగా తనని తను సరిచేసుకోవటమో చేస్తూ మార్గంలాగా మారిపోయి మార్గంలోనే పతనమయి పోతుంది. ఇలాంటి జీవి పరిస్థితిని కళ్ళకు కట్టినట్టు వర్ణించాలంటే - మార్గంలోని మట్టిని తవ్వుకుని నెత్తిమీద పోసుకుంటూ క్రమంగా ఆ మట్టిలో కూరుకుపోయి సమాధి అయిపోతుంది. జ్ఞానంలోనో, యోగంలోనో, ప్రేమలోనో ఏదో ఒక దానిలో సమాధి అయిపోతుంది.

అలా కాకుండా జీవి తన ఎడతెగని ధ్యాసతో నిజ స్థితికి చేరి నిలిచిన తర్వాత ఆ నిజానికీ, నిజ స్థితికీ కూడా అధికారి అయిన భగవంతుడు జీవిని జీవితో పాటు జీవి నడిచిన మార్గాన్ని గుర్తించి హర్షిస్తారు. భగవంతుడి హర్షానికి కారణమైన జీవి, మార్గము రెండూ కీర్తించబడతాయి. జీవి నిజస్థితిలో నిలిస్తే మార్గము భగవంతుని పాదాల వద్ద నుండీ కిందకు మార్గముగా వేయబడుతుంది. అంటే ప్రేమ జీవిని

నిజానికి చేరిస్తే ఆ ప్రేమ బాబా పాదాల వద్ద చేరి అక్కడ నుండీ కిందకి మార్గంగా వదలబడుతుంది. తిరిగి కింద నుంచీ పైకి (అబద్ధం నుండీ నిజానికి) ఇతర జీవులు చేరటానికి వీలుగా! అంటే ఇతర జీవులు ఆ మార్గంలో సక్రమంగా నడిచి ఫలించలేక పోయినా మార్గం మాత్రం బాబా చరణాల వద్ద స్థానాన్ని కోల్పోదు. అందుకే నిజ స్థితిలో నిలిచిన జీవిని ఆ జీవి నడిచిన మార్గము ఎప్పుడూ సత్కరిస్తూ వుంటుంది. నిజ స్థితిలో నిలిచిన జీవిని ప్రేమ, భక్తి, ఒప్పుదల గురువు అందరూ అపురూపంగా భావిస్తారు.

జీవి ధ్యాస వల్ల మార్గములోని ఏ మాయా జీవిని అంటదు. మార్గము కూడా ఫలిస్తుంది. జీవి ధ్యాస ఫలించినట్లే. జీవి నిర్వ్యాపారుడై ఫలించింది. మార్గము ఫలవంతమవటం ద్వారా జీవి ధ్యాస ఫలించింది.

## 3. గమ్యాన్ని చేరుకున్న జీవి తిరిగి ఫలించాలి

జీవి నిర్వ్యాపారుడై తన నుంచీ తను విడుదల కాబడి ఫలించింది. మార్గ ప్రభావంలో పడకుండా నిజస్థితిలో నిలిచి తద్వారా మార్గాన్నీ ఫలింపచేసింది. అయినా మళ్ళీ జీవి ఫలించాలి అంటున్నాం అది ఏ దిశలోనో తెలుసుకుందాం. నిజ స్థితిలో నిలిచిన జీవికి ఏమీ తెలియదు కానీ నిజ స్థితిలోకి వచ్చేసింది. అంటే ఒక చిన్న పిల్లవాడు తల్లిని చూసుకుంటూ దేనిని పట్టించుకోకుండా పరిగెత్తి తల్లి ఒడిని చేరినట్లు జీవీ భగవంతునిపై ధ్యాస పెట్టి భగవంతుని చేరి అంటే నిజస్థితిలో చేరి నిలిచి పోయింది. పసి పిల్లవాడికి తల్లి తప్ప మరి ఏమీ పట్టనట్టు undivided attention ను కలిగి వున్న జీవికి బాబా తప్ప ఏదీ గుర్తువుండదు కాబట్టి నిజంలో నిల్చుండిపోతుంది. అందుకే పసి పిల్లలే దేవుని సామ్రాజ్యం చేరగలరని పలువురు పలు సందర్భాలలో ప్రస్తావించారు.

జీవి కలిగివున్న విభజింపబడని ధ్యాసే(undivided attention ) జీవి యొక్క పసితనము. ఇలా ఈ పసి తనముతో జీవి భగవంతుని చేరింది కానీ జీవికి తన గురించీ తనకు తెలియదు. భగవంతుని గురించీ తెలీదు. జీవి తనను తను దాటింది కానీ తన గురించీ తను తెలుసుకోలేదు భగవంతునీ తెలుసుకోలేదు



అంటే నిజంలో నిలిచింది కానీ నిజాన్ని అనుభవించలేదు కాబట్టి జీవి తిరిగి ఫలించాలి అంటున్నాం. జీవి సమస్తమూ తెలుసు కోవాలి.

జీవి తన గురించి తను తెలుసుకోవాలి. తనలోనే ప్రశ్న సమాధానం వున్నాయని పసిగట్టాలి. తొలుత తను దాటిన ప్రశ్న ఇప్పుడు చేరుకున్న సమాధానం రెండూ తనలోనే వున్నాయని గుర్తించాలి. ప్రతీదీ తనలోనే Start అయి తనలో End అవుతోంది అని తెలుసుకోవాలి. మంచికి కానీ చెడుకానీ దేనికైనా ఆధారం తానేనని తెలుసుకోవాలి. ఇక్కడ మంచి, చెడు అంటే సహజమైనది, అసహజమైనది అని భావము. సహజంగా జరగబడే చర్యకు ఆధారము, అసహజంగా జరగబడే చర్యకు కారణం తనే అని తెలుసుకోవాలి. అనుభవించాల్సిన వస్తువు (నిజం) అనుభవించే వస్తువు (జీవి ) రెండూ తనలోనే వున్నాయని జీవి తెలుసుకోవాలి. ఫలము, ఫలభోగి అనగా ఆది అంతాలు తనలోనే వున్నాయని తెలుసుకోవాలి.

జీవిలో పుడుతున్న ప్రేమను మరింత పుట్టనివ్వాలి. జీవిలో ఆ ప్రేమ ఊటను ఊరనివ్వాలి. అలా ప్రేమ ఊట ఊరాలంటే ఆ ప్రేమకు సాక్షిగా మాత్రమే ఉండాలని తెలుసుకోవాలి. అప్పుడే భగవంతుని కోసం భగవంతుని ద్వారా ఊరుతున్న ప్రేమ ఊట భగవంతుని చేరుతుందని గ్రహించాలి. అలా చేరిన ప్రేమే తనకు దాహం లేకుండా చేస్తుందని, ఊరుతున్న ఊటను తనే తాగితే తనకు ఎప్పటికీ దాహం తీరదనీ తెలుసుకోవాలి. అంటే జీవిలో కలుగుతున్న ప్రేమ అనే భావంలో జీవి పడకుండా ప్రేమను కలిగి వుండటం తప్పనిసరి అని జీవి తెలుసుకోవాలి. ఆ ప్రేమే తన ఉనికికి ఆధారం అని జీవి క్రమేణా తెలుసుకోవాలి.

అలాగే తన మార్గము తనలోనే వుందని తెలుసుకోవాలి. అంటే ఆ మార్గములో వున్న సాధక బాధకాలు వాటిని దాటటానికి కావల్సిన మెళకువులు జీవి తెలుసు కోవాలి. జీవి వాటి నేమీ స్వయంగా అనుభవించక పోయినా వాటి పరిష్కారాలని వాటిని దాటే రహస్యాలని తనలోనే కలిగి వుంటుందని తెలుసుకోవాలి. ఎందుకంటే మార్గమూ జీవి నిజాన్ని ఆశ్రయించి యజమాని చెంత చేరింది కాబట్టి మార్గములోని రహస్యాలు జీవి అనుభవించకపోయినా తెలుసుకుంటుంది. అలా ప్రతి విషయపు

పరిజ్ఞానాన్ని తన అనుభవంతో సంబంధం లేకుండా తన సొత్తుగా కలిగి వున్నానన్న నిజాన్ని జీవి తెలుసుకుంటుంది.

ప్రతి విషయపు నిజా నిజలను బేరీజు వేసుకోగల్గాలి. అంటే సహజమైన దాన్ని, అసహజమైన దాన్ని వేరు చేయగల గుణం కలిగి వున్నానని తెలుసుకోవాలి. ఏ దానినైనా తీర్పు తీర్చగల నేర్పు ఓర్పు కలిగివున్నానని జీవి తెలుసుకోవాలి.

ఏ విషయపు బాధ్యత స్వీకరించకుండా విషయాన్ని చక్కబెట్టగల్గే నేర్పు కలిగి వున్నానని జీవి తెలుసుకోవాలి. తను స్వయంగా చేయాల్సిన పనినైనా బాధ్యత స్వీకరించకుండా చేయగల నేర్పు తనకు వున్నదని జీవి గ్రహించాలి. ఎప్పటికైనా తను సహజంగా వుండటానికే ఇష్టపడుతున్నానని తెలుసుకోవాలి. తనలో వున్న పరిశుద్ధతను తెలుసుకుని దానికి తనే కాపలాగా వున్నాననీ తన ఇష్టమైతేనే లోపలికి ఏదైనా అపరిశుద్ధత వస్తుందని లేకపోతే తనను ఏదీ అంటలేదని తెలుసుకోవాలి. తనలోనికి ఇతరమైనది ఏదీ చొరబడనివ్వనటువంటి ఖాఠిన్యం తను కలిగి వున్నాననీ అదే నిజం అని తెలుసుకోవాలి.

ఏ విషయాన్నీ, ఉద్దేశ పూర్వకంగా ఉద్ధరించక్కర్లేదని నిజాన్ని exhibit చేస్తూ వుంటే చాలు ప్రతీ విషయం ఉద్ధరింపబడుతుందని తెలుసుకుంటుంది. అంటే తనకు తెలియబడిందని ఆ విషయాన్ని తెలియబడని వారికి తెలియచెప్పే ప్రయత్నం ఉద్దేశ పూర్వకంగా చేస్తూ వారి బాధ్యతను నెత్తిన వేసుకోకూడదు అని తెలుసు కుంటుంది. అంటే తన ఖజానాను తను ఉద్దేశపూర్వకంగా వాడకూడదు దానంతట అదే వాడబడుతుంది అని తెలుసు కుంటుంది.

మొదటి దశలో తను పట్టించుకోకుండా వదిలేసిన ప్రతి సందేహానికి, సంశయానికీ సమాధానాన్ని పొందుతుంది. ఆ సమాధానం జీవికి తేట తెల్లంగా అవగతం అయి లొంగి పోవటంతో ఆ సమాధానం నుండీ జీవికి మరో సందేహం పుట్టదు. పాత సందేహాలన్నీ తీరిపోతాయి ఇక ఇప్పుడు ఏదైనా ప్రశ్న వచ్చినా వెంటనే విప్పబడుతుంది. అసలు ఈ దశలో వచ్చిన ప్రశ్నను ప్రశ్న అనకూడదు జీవి తన ఖజానాలోని రహస్యాలను తెలుసుకొనే పరికరం ప్రశ్నగా అనబడుతుంది. (ప్రశ్న అనే Spoon తో ఖజానాలోని రహస్యాన్ని తీసుకుని తినటం).



అలాగే మొదటి దశలో కోరికలు, కూడా జీవికి అర్థమయి తీర్చబడతాయి. అంటే జీవికి దోహదపడటానికి పుట్టిన కోరిక అయితే అది జీవికి మేలు చేసే దశలో తీర్చబడుతుంది. ఏదైనా అనవసరమైన కోరిక వుంటే అది జీవికి అనవసరమైనదిగా అర్థమవుతూ తీర్చబడుతుంది. ఒక ఉదాహరణ తీసుకుని చెప్పాలంటే - జీవికి బాబాతో వుండాలన్న కోరిక వుంటే నిజంగా బాబాతో వుండటం అంటే ఏంటో అర్థమై ఆ నిజంలో నిలవడం ద్వారా ఆ కోరిక తీర్చబడుతుంది. జీవికి ఆకాశంలో ఎన్ని చుక్కలు వున్నాయో లెక్కబెట్టాలన్న కోరిక వుంటే అలా లెక్కబెట్టటం నిరుపయోగమని అర్థమై ఆ ఆసక్తి పోవటం ద్వారా ఆ కోరిక తీర్చబడుతుంది, ఇలా మొదటి దశలోని విత్తనాలు (సంశయాలు, సందేహాలు, కోరికలు) అన్నీ ఏరివేయబడతాయి.

జీవి నిజస్థితిలో నిలిచి తన గురించీ తను తెలుసుకుంటుంది, తన మార్గాన్ని గురించి తెలుసుకుంటుంది. భగవంతుని గురించి తెలుసుకుంటూ తనలో వున్న నిజలక్షణాలు (ఆద్యంతాలు కలిగి వుండటం, దేనినైనా సరిగ్గా చేయగల నేర్పు వుండటం, బాధ్యత స్వీకరించకుండా పని చక్క బెట్టగల్గటం, దేని ప్రభావం లోకి వెళ్ళకుండా వుండగల్గటం లాంటివి) భగవంతునివిగా తెలుసుకుంటుంది మార్గములోని రహస్యాలు తెలుసుకుంటూ వాటికి ఆధారం భగవంతుడిగా తెలుసు కుంటుంది. మార్గమును అంటించుకోకుండా గమ్యాన్ని చేరుకోగల్గానంటే సమస్తమూ సమకూడి జరగటం వల్లే అని తెలుసుకుని అది భగవంతుడి లక్షణంగా తెలుసు కుంటుంది. తనలో మార్గంలో గమ్యంలో వున్న నిజం అంతా భగవంతుడిగా తెలుసు కుంటుంది. ఆ నిజం తనలోనే వుంది తను నిజంలోనే వున్నాను అని తెలుసు కుంటుంది. అంటే "భగవంతుడి చిత్త ప్రకారం వున్నాను భగవంతునిలో వున్నాను భగవంతుని చిత్తంలో నేను, నాలో భగవంతుని చిత్తం వున్నాయని జీవి తెలుసు కుంటుంది. తనని తను తెలుసుకుంటున్నప్పుడు తెలియబడింది, మార్గాన్ని తెలుసుకుంటున్నప్పుడు తెలియబడింది. కూడా ఒక్క భగవంతుడే అని తెలుసు కుంటుంది. తన undivided attention కూడా భగవత్ లక్షణమే అని తెలుసు

కుంటుంది. దేనిని పట్టకుండా నిమిత్త మాత్రంగా వుంటూ తనలో తను క్రీడిస్తున్న భగవంతుని స్వాత్మక్రీడే తనకు గమ్యాన్ని చేరక ముందు undivided attention గా decode అయిందని గమ్యానికి చేరాక తనని తను తెలుసుకొని తనలో తను విహరించే స్వాత్మక్రీడగా decode అయిందని తెలుసుకుంటుంది.

ఇలా తనగురించి, మార్గం గురించి, గమ్యం గురించి తెలుసుకుంటూ అంతా ఒక్కటే అని ఏకమై వున్నామని తెలుసుకుంటుంది. తనకు తెలియబడక ముందు తనధ్యాస (జీవి), తన ధ్యానము (మార్గము), తన ధ్యేయము (గమ్యము) మూడు భిన్నమైనవిగా కనిపించాయని నిజంలో నిలబడి నిజాన్ని అనుభవించాక ధ్యాస, ధ్యానము, ధ్యేయము అభిన్నమైనవిగా ఒక్కటిగా తెలియబడ్డాయని తెలుసుకుంటుంది. సమస్తమూ ఒక్కటే అని ఆ ఒక్కటీ కలిగి వుంది తనేనని తెలుసుకుంటుంది. అంటే సమస్తము తనలో వున్నదని ముందు సమస్తంలో నిండి వున్నది తనే అని తెలుసుకుంటుంది. ఇలా తన ధ్యాసని ధ్యానమును ధ్యేయమును ఏకంగా నిరూపించి సమస్తాన్ని రుచి చూపిన తన బాబా పట్ల జీవి అవ్యాజమైన అనురాగాన్ని అఖండమైన శరణాగతిని కలిగి వుంటుంది. అంతా ఒక్కటి అని తెలిసాక అనురాగము, శరణాగతి నిజం కాదు భావమే బాహ్య దృశ్యమే అని తెలిసినా ఆ భావాన్ని ఎంతో ఇష్టంగా కలిగి వుంటుంది. ఈ శరణాగతి భావం వల్ల జీవికి ఎప్పటికీ ఏ ఢోకా వుండదు. ఇలా తనని తను తెలుసుకుంటూ సమస్తాన్ని రుచి చూడటం ద్వారా గమ్యాన్ని చేరిన జీవి సర్వవిధాల ఫలిస్తుంది.



## 4. సర్వ విధాల ఫలించిన జీవి సర్వానికీ అతీతం అవ్వాలి :

జీవి తనను దాటి ఫలించి, మార్గాన్ని అంటించుకోక దాటి దానినీ ఫలింపచేసి, గమ్యాన్ని చేరుకుని సమస్తమూ తనలోనే రుచి చూసి తిరిగి ఫలించటం ద్వారా సర్వ విధాలుగా ఫలించింది. ఇప్పుడు సర్వవిధాల ఫలించిన జీవి సర్వాతీతము అవ్వాలి. భగవంతుడే దారిగా భగవంతునే చూస్తూ ఎటూ చూడక వడివడిగా భగవంతుని చేరి భగవత్ తత్వం మొత్తాన్నీ రుచి చూసింది. తనకు తెలియని లోకపు తీపిని రుచి చూపిన బాబాపై అనురాగాన్ని, శరణాగతిని కలిగివుంది. ఇంక సర్వాతీతయు అవటం అంటే ఏమిటో తెలుసుకుందాం!

గమ్యాన్ని చేరిన జీవి తనను తను తెలుసుకోవటమనే పనిలో వుంటూ తన ధ్యాసను మరల్చినట్లు అయింది. అయితే ఎక్కడ చూసినా భగవంతుని విషయాలనే చూస్తూ ఆయననే అర్థం చేసుకుంటుంది కాబట్టి ధ్యాస విభజించ బడినట్లు కాదు గానీ, విస్తరించబడినట్లు (widen) జీవి ఇంక దానికీ ఇష్టపడదు. సమస్తము తనలో వుందనీ, సమస్తములో నిండి వుందీ తనలోనే అని తెలిసినా సమస్తములో ధ్యాస నిలపటం ఎందుకు అంతా భగవంతుడిదే అయినా సరే ధ్యాస బాబాపైనే వుండాలి అనుకుంటుంది. అంటే బాబాని గమనింపు అనే అద్దం ద్వారా చూస్తూ వుంటే ఆ అద్దంలో తనే కనిపించటంతో సర్వాన్నీ అర్థం చేసుకుంది ఇంక ఆ అద్దం కూడా లేకుండా తనను తను చూసుకోవాలి అని తెలుసుకుంటుంది.

అంటే విస్తరించబడిన తన ధ్యాసను సమస్తమూ ఒకటే అని తెలుసుకోవటం ద్వారా తన ధ్యాసను తిరిగి సూక్ష్మాతి సూక్ష్మం చేసుకుని బాబా వైపు మరలుస్తుంది. ఎక్కడ వున్న బాబానైనా సరే విషయాలను అంటకుండా తన సూక్ష్మాతి సూక్ష్మమైన ధ్యాస ద్వారా గ్రహిస్తుంది. సర్వవ్యాపకాన్ని అనుభవించాక తిరిగి సూక్ష్మాతి సూక్ష్మం అవ్వాలి. అదే నిజం అన్న ఈ విషయాన్ని గ్రహిస్తూ తిరిగి ధ్యాసను సూక్ష్మం చేస్తుంది. అంటే ఇంక ధ్యాసలో గ్రహింపులో జీవి, మార్గము, గమ్యము అనే ముక్కలు ముక్కలు వుండవు అంతా ఒక్కటే, ఆ ఒక్కటే బాబా. ఇలా అన్నిటికీ అతీతమై పోతుంది.

జీవి తనకి తను, మార్గానికి, గమ్యానికి, అనుభవానికి, అనుభూతికి, నిజానికీ అన్నిటికీ అతీతం అయిపోతుంది సర్వాతీతమై పోతుంది. ఇలా సర్వాతీతమై పోయి శూన్యంగానూ వుండదు. తిరిగి ఏ దశలో కావాలంటే ఆ దశలో కార్యార్థిమై వ్యవహరించగలదు ఏ అనుభూతినైనా అనుభవించగలదు! అంటే సర్వాతీతమనే స్థితిలో కూడా ఇరుక్కుపోదు కావాలంటే సర్వములో కూడా వుండగలదు అంటే సర్వాతీతమనే స్థితికి కూడా అతీతమైపోయింది జీవి.

ఇప్పుడు జీవి పూర్తి స్థాయిలో ఏకత్వాన్ని కలిగి సూక్ష్మమై నిరాధారంగా వుండగలదు, సర్వవ్యాపకాన్ని అనుభవిస్తూ కూడా శరణాగతి భావంతో వుండగలదు. సర్వాధారమై వున్నానని తెలుసుకుని కూడా సర్వాతీతంగా వుండగలదు. తనను తను తెలుసుకుంటున్న జీవిగా, మార్గంగా, మార్గదర్శకంగా, గమ్యంగా, గమ్యంలో వున్న నిజంగా, నిజానికి ఆధారమైన ultimate, ultimate యొక్క శరణాగతునిగా, సమస్తంగా, సర్వవ్యాపకంగా, సూక్ష్మంగా, అతీతంగా, ఒకటిగా, వందగా, ఉనికిగా సర్వ విధాలా జీవి వ్యవస్థితం కాగలదు. భగవంతుడు అనంతుడు నిరంతరం రూపాంతరం చెందుతారు కాబట్టి మనం ఎప్పుడూ వారి గురించి తెలుసుకోగలిగే వీలును కలిగి వుండాలి. మన పరిధి మేరకు తెలియబడిన మేరకు తెలుసుకుని ఇంక అయిపోయిందని సర్వాతీతమనే చట్రంలో చిక్కుకుంటే మళ్ళీ మళ్ళీ భగవంతుని అనుభూతి చెందలేం అందుకే సర్వాతీతం అయి ఆ స్థితికీ అతీతంగా అన్నింటా వుండగల్గాలి. అప్పుడే భగవంతుని మరల మరల కొత్తగా సరికొత్తగా తెలుసుకోవచ్చు భగవంతునితో చనువు ఏర్పడుతుంది.

ఇలా సర్వాతీతమై తిరిగి బాబా ఇంకా ఏమైన తెలియబడతారేమో అని వేచి వుంటూ వారిని అందిపుచ్చుకోవటానికి అన్నింటిగా వుండగల్గే నేర్పు కలిగి వుండటమే నిజమైన శరణాగతి. తెలియబడింది అంతా తెలుసుకున్నాను ఇంక అతీతంగా వుంటాను లేదంటే నిజాన్ని కోల్పోతాను అనుకున్నా అది ఒక లాంటి సంకుచితమే! అదే తెలియబడింది తెలుసుకుని జాగ్రత్త చేసుకుని ఇంకా తెలియబడుతుందేమో



అని వేచి చూస్తూ కూడా జాగ్రత్తగా వుండగల్గటమే నిజ శరణాగతి. అలాంటి ఎదురు చూపులే భగవంతుడికి నిజ నివేదన, నిజ పూజ. అలాంటి జీవిని చూసి బాబా నాట్యం చేస్తారు అంటే మరింత స్పష్టంగా వెదజల్లబడతారు. ఇలా జీవి ఎటువైపు అయినా ఎగరగల్గే ఎంతెత్తుకైనా ఎగరగల్గే పక్షిగా మారడమే సర్వపరి పూర్ణము. ఈ సర్వపరిపూర్ణమైన జీవి ఎక్కడా చిక్కుకుపోడు ఎవరికీ దొరికిపోడు. ఎప్పటికీ శాశ్వతంగా సురక్షితంగా వుంటాడు.

ఇలా సర్వంలో వుంటూ, సర్వాతీతంగా వుంటూ, నిజ్జంగా నిజ్జంగా నిజ్జంగా నిజమైవుంటూ సర్వపరిపూర్ణమైన జీవి యొక్క సౌందర్యం ఎంత అమోఘమైనదో ముగ్ధులైపోతారు. తన నిజ సౌందర్యానికి జీవి కూడా కదా! ఆ నిజ సౌందర్యానికి బాబా కూడా (flat) ముగ్ధుడై అంతటి సౌందర్యం ఎక్కడా కనపడక తిరిగి తిరిగి తన సౌందర్యాన్ని ఆస్వాదించడానికి ఎప్పుడూ సర్వపరిపూర్ణంగా వుంటుంది.

ముఖ్యగమనిక : జీవి తనను తను తెలుసుకోవడం అన్న విషయం గానీ, బాబాను తెలుసుకోవడం అన్న విషయం గానీ, సర్వ పరిపూర్ణత్వపు అనుభూతినిగానీ పూర్తిగా మాటల్లో చెప్పేది కాదు. అది అనుభవంలోకి వస్తున్న కొద్దీ ఎంతో లోతైనది ఎంతో ఎంతో ఎత్తైనది ఎంతో విశాలమైనది ఎంతో సూక్ష్మమైనది. అమోఘమైన నిజాన్ని మాటల్లో వర్ణించి అర్థం చెయించటానికి చేసిన ఈ ప్రయత్నము ఒక రకంగా దుస్సాహసమే, అయినా యజమానిని వారి బహుమతులను తెలుసుకోవాలి కాబట్టి తెలుసుకోవడానికే ఈ ప్రయత్నము. చర్చలలో ఒదగని ఎంతో నిజం అనుభవంలో ఒదుగుతుంది అని ఖచ్చితంగా చెప్పవచ్చు.

ఇంతటి విషయాన్ని తెలియచేసిన యజమానికి కృతజ్ఞతలు తెలియచేస్తూ, పూర్తి పూర్తిగా వారి Gift ని మాటల్లో తెలియపరుచుకోలేనందుకు క్షమాపణలు వేడుకుంటూ, మరింతగా యజమాని కోసం నిరంతరం ఎదురుచూస్తూ.............

- గిరిధర్ వాణీ ఆనందనందనము

**అఖండ పరిపూర్ణ పరబ్రహ్మ గిరిధర్ వాణీ జై !**

## ముందుమాట

లోక కళ్యాణాన్ని కోరుకునే "గిరిధర్ వాణి" ఆ పని చేయటానికి "గిరిధర్‌వాణి ఆనందనందనం" ను ఏర్పాటు చేసింది. ఈ ఆనంద నందనం విజయవాడ సమీపంలోని తాడేపల్లి వద్ద కలదు. ఇచ్చట ప్రతి గురు, ఆది వారాలలో గిరిధర్‌వాణి సత్యవర్ష అనే కార్యక్రమం జరపబడుతోంది. ఈ సత్యవర్షలో ప్రతి జీవికి, జీవి గురించిన సత్యాలు తెలియచేస్తోంది గిరిధర్‌వాణి. జీవి అసలు ఏ పనిమీద జన్మకి వచ్చింది?

ఆ పనిని ఎలా విజయవంతంగా పూర్తి చేసుకోవాలి?

భగవంతుడు అంటే ఏమిటి?

భగవంతుడిని ఎలా ఆస్వాదించాలి?

భగవంతుడితో ఉంటూ సంసారంలో ఎలా మెలగాలి?

సమాజంలో ఎలా ప్రవర్తించాలి? సమాజంతో ఎలా ప్రేమగా ఉండాలి?

లాంటి అనేక భగవత్ విషయాలను, అందరికీ అర్థమయ్యేలా ఏ సాధనా లేకుండానే బోధిస్తోంది గిరిధర్‌వాణి. ఈ సత్యవర్షలో అనేకమంది తడిచి ఆనందిస్తున్నారు. ధన్యులు అవుతున్నారు. గిరిధర్ వాణి వర్షించిన సత్యాలలోని కొన్నింటిని పుస్తకాల రూపంలో పొందుపరచటం జరిగింది. అందరూ వీటిని పదే పదే చదివి, అన్వయించుకుని, ఆనందించాలి అన్న ఉద్దేశంతోనే ఈ సత్యాలను పుస్తకరూపంలో వెలువరించటం జరుగుతోంది. వీటిని అందరూ చదువుతూ ఆనందిస్తూ తరించాలని కోరుకుంటూ.......

**-గిరిధర్ వాణి ఆనందనందనం**


**గిరిధర్ వాణి సత్యవర్ష**

**ప్రచురణకర్త : ముద్రించువారు**

**శ్రీ బి. గిరిధర్ సింగ్**

గిరిధర్ వాణి సత్యవర్ష
9-62-77, డ్రైన్ స్ట్రీట్,
ఇస్లాంపేట, విజయవాడ -1
ఫోన్ : 0866 - 3294745

సంప్రదించవలసిన నెంబర్ :
08645 - 273373


**ఈ సంచిక ప్రాప్తిస్థానము**


Copy Rights Reserved



**ప్రింటింగ్ చార్జ్ : 25**
పోస్టేజీ అదనం



**శ్రీ బి. గిరిధర్ సింగ్,**

**గిరిధర్ వాణి సత్యవర్ష 9-62-77,**
**ఇస్లాంపేట, విజయవాడ -520 001. : 0866-3294745, 6545745**
**గిరిధర్‌వాణి ఆనంద నందనం, తాడేపల్లి, ఫోన్ : 0866 - 3294745**

**website : www. appgv.org**
**email : info @ appgv.org** **appgv.email @ gmail.com**